క్లుప్తంగా

విగ్రహాల ఏర్పాటులో నిబంధనలు తప్పనిసరి



జి.కొండూరు: వినాయక చవితిని పురస్కరించుకుని ఏర్పాటు చేయనున్న మండపాలు, గణేష్ విగ్రహాల ఏర్పాటులో పోలీసు శాఖ ఆదేశాలను ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలని ఎస్ఐ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక కమ్యూనిటీహాల్‌లో గణేష్ ఉత్సవ కమిటీలతో ఎస్ఐ సతీష్‌కుమార్ ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మండపాలు, విగ్రహాల ఏర్పాటుకు తీసుకోవాల్సిన అనుమతులు, జాగ్రత్తలను నిర్వాహకులకు ఎస్ఐ వివరించారు. మండపాల వద్ద అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, ఊరేగింపులు, నిమజ్జనాల సమయంలో వివాదాలకు పోయి కొట్లాటకు పాల్పడినా అటువంటి వ్యక్తులతో పాటు నిర్వాహకులపై కూడా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని వివరించారు. ట్రైనీ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

చెరువు కట్టను అభివృద్ధి చేయాలి



మైలవరం: మైలవరం మండలం చంద్రాల గ్రామంలోని మంత్రి చెరువు గత ఏడాది వచ్చిన వర్షం, వరదలకు చెరువు కట్ట తెగి ఆర్ అండ్ బీ రహదారిపై నుంచి వరద నీరు ప్రవహించి పక్కనే ఉన్న పంట పొలాలను ముంచెత్తింది. అధికారులు తాత్కాలికంగా చెరువు కట్టకు మరమ్మతులు చేపట్టారు కానీ శాశ్వత పరిష్కారం చేయకపోవడంతో గ్రామస్తులు, ముఖ్యంగా రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ చెరువు విస్తీర్ణం సుమారు 80 ఎకరాలు ఉంటుంది. ఈ చెరువు కింద 220 ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. ఈ రహదారి మీదుగా నూజివీడు, విజయవాడకు నిత్యం కార్లు, లారీలు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు, బస్‌లు రాకపోకలు సాగిస్తుంటాయి. మళ్లీ భారీ వర్షాలు కురిస్తే చెరువులు, కాలువలు పొంగే ప్రమాదం ఉంది. ఇరిగేషన్ అధికారులు స్పందించి చెరువుకట్ట అభివృద్ధికి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పెరటి కూరగాయలతో సంపూర్ణ ఆరోగ్యం



ఇబ్రహీంపట్నం: రసాయన ఎరువులు లేని పెరటి కూరగాయల పెంపకంతో కుటుంబ సభ్యులకు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు అన్నారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు పెరటి తోటల పెంపకంపై ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రతి ఒక్కరూ కనీసం పది కూరగాయ మొక్కలు టెర్రస్, పెరటి తోటలుగా పెంచుకుంటే ఏడాది పొడవున ఆహారానికి అవసరమైన కూరగాయలు లభిస్తాయని చెప్పారు. పెరటి కూరలు పర్యావరణంతో పాటు ఆరోగ్యం కలిగిస్తాయని వివరించారు. కూరగాయ విత్తనాలను మహిళలకు పంపిణీ చేశారు. సిటీ మిషన్ మేనేజర్ శ్రీధర్, కో–ఆర్డినేటర్ వెంకయ్య, కౌన్సిలర్ అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

సమరయోధుడు రాజ్ గురుకు నివాళి



తిరువూరు: స్వాతంత్ర్య సమరయోధుడు శివరాం హరి రాజ్ గురు జయంతి కార్యక్రమం గంపలగూడెం మండలం పెనుగొలనులో ఆదివారం జరిగింది. షిర్డీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో రాజ్ గురు చిత్రపటానికి విద్యార్థులు పూలమాల వేసి నివాళులర్పించారు. సర్దార్ భగత్‌సింగ్, సుఖ్‌దేవ్‌తో కలిసి రాజ్‌గురు బ్రిటిష్ పాలకులపై వీరోచితంగా పోరాడారని, ఆయన చిన్నతనంలోనే స్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటంలో ఉరికంబం ఎక్కారని సాయిబాబా సేవా కమిటీ అధ్యక్షుడు ఊటుకూరు నారాయణరావు వివరించారు.

ఆర్థికసాయం అందజేత

తిరువూరు: తమ తోటి స్నేహితుడు అనారోగ్యం బారిన పడి వైద్య చికిత్స కోసం ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించిన తిరువూరు పట్టణ ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు రూ.50 వేల ఆర్థికసాయాన్ని ఆదివారం అందజేశారు. తిరువూరుకు చెందిన కరుగాయల సురేష్ ఇటీవల అనారోగ్యం పాలవగా, ఈ సొమ్మును అతనికి అందజేసినట్లు కొత్తగుండ్ల కాంతారావు, నాగుబండి విశ్వేశ్వరరావు, నాగార్జున తదితరులు తెలిపారు.

చెరువు ఇలా.. సాగు ఎలా?

- ఎండిపోయిన కోడూరు ఎర్ర చెరువు
- ఆగస్టు నెలాఖరు వచ్చినా నారు కూడా పోయని వైనం
- వెదజల్లుదామన్నా నీరు లేక ఎదురు చూపులు
- ఆయకట్టు భూమి 244 ఎకరాల్లో సాగు ప్రశ్నార్థకం



నీరు లేక ఎండిపోయిన కోడూరు ఎర్ర చెరువు



కోడూరు ఎర్ర చెరువు పరిధిలో బీడుగా మారుతున్న ఆయకట్టు పొలాలు

జి.కొండూరు: పాలకుల నిర్లక్ష్యంతో రైతులు సంక్షోభంలో పడిపోతున్నారు. ఎగువన గోదావరి, దిగువన కృష్ణానది వరదలతో ఉరకలు పెడుతున్నప్పటికీ మైలవరం నియోజకవర్గంలో సాగునీరు అందక రైతులు నరకయాతన పడుతున్నారు. కృష్ణా నదిలో వరదంతా వృథాగా సముద్రంలోకి పోతున్నప్పటికీ సాగర్ జలాలను తీసుకురావడంలో పాలకులు విఫలమయ్యారు. ఫలితంగా జి.కొండూరు మండల పరిధి కోడూరు ఎర్ర చెరువులో నీరు లేక ఆయకట్టు భూమి సాగు ప్రశ్నార్థకంగా మారింది. సాగు చేపట్టకపోతే తినడానికి పిడికెడు మెతుకులు కూడా దొరకవని రైతు కుటుంబాల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వెలవెలబోతున్న ఎర్ర చెరువు

కోడూరు ఎర్ర చెరువు గ్రామానికి ఆనుకొని 80 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఈ చెరువు కింద ఆయకట్టు భూమి 244.25 ఎకరాలు ఉంది. వర్షాలు పడినప్పుడు చెరువుకు సమీపంలో ఉన్న కొండల్లో నుంచి వచ్చే వరద ప్రవాహం పంచళ్ల వాగు ద్వారా ఎర్ర చెరువుకు చేరుతుంది. ఎన్ఎస్‌పీ జక్కంపూడి మేజర్ కాలువ ద్వారా సాగర్ జలాలు సైతం ఈ చెరువుకు వచ్చే అవకాశం ఉంది. అయితే ఈ ఏడాది కోడూరు వైపు భారీ వర్షాలు పడకపోవడంతో పాటు సాగర్ జలాలను తీసుకురావడంలో ప్రజాప్రతినిధులు విఫలమవడంతో చెరువు నీరు లేక వెలవెలబోతోంది. ఆగస్టు నెలాఖరు వచ్చినా చెరువులో నీరు లేకపోవడంతో సాగు ప్రశ్నార్థకంగా మారి రైతులు ఆందోళన చెందుతున్నారు.

నార్లు కూడా పోయలేదు

ఈ ఏడాది ఎర్ర చెరువు కింద రైతులు వరి సాగు చేపట్టేందుకు ఇప్పటివరకు నార్లు కూడా పోయలేదు. దీనికి కారణం చెరువులో నీరు లేకపోవడమే. వేసవిలో అధికార పార్టీ నాయకులు అక్రమ మట్టి తవ్వకాలు చేపట్టడంతో భారీ గుంతలు ఏర్పడ్డాయి. వర్షానికి వచ్చిన కొద్దిపాటి నీరు కూడా ఈ భారీ గుంతలలో ఉండటంతో తూముల వద్దకు చేరే అవకాశం లేక రైతులు నార్లు పోసేందుకు ధైర్యం చేయలేకపోయారు. నార్లు పోసే సమయం దాటి పోవడంతో కనీసం వరి విత్తనాలను వెదజల్లే పద్ధతిలో సాగు చేపడదామనుకున్నప్పటికీ దమ్ములు చేసేందుకు నీరు లేకపోవడంతో సాగు నీటి కోసం రైతులకు ఎదురుచూపులు తప్పడంలేదు. ప్రజాప్రతినిధులు సత్వరమే స్పందించి సాగర్ జలాలను తీసుకువస్తేనే కోడూరు ఎర్ర చెరువు కింద సాగు చేపట్టడానికి వీలుంటుంది.

బీడుగా మారుతున్నాయి



నాకు ఎర్ర చెరువు కింద మూడు ఎకరాల పొలం ఉంది. ప్రతి ఏటా ఈ సమయానికి నాట్లు వేస్తుంటాం. ఈ ఏడాది చెరువులో నీరు లేకపోవడంతో నార్లు కూడా పోయలేదు. కనీసం వడ్లు వెదజల్లుదాం అంటే దమ్ము చేసేందుకు కూడా నీరు లేదు. సాగర్ జలాలు వస్తేనే సాగు చేయడానికి వీలుంటుంది.

– ముక్కాముల రామకృష్ణప్రసాద్, ఎర్ర చెరువు ఆయకట్టు రైతు, కోడూరు

తిండిగింజలు కూడా ఉండవు



ఈ ఏడాది ఎర్ర చెరువులో నీరు లేక నార్లు కూడా పోయలేదు. సాగర్ జలాలు వస్తేనే చెరువు నిండుతుంది. నాకు ఎర్ర చెరువు కింద నాలుగు ఎకరాల పొలం ఉంది. ఆగస్టు నెలాఖరు వచ్చినా చెరువులో నీరు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. సాగు చేయకపోతే రైతులకు తిండి గింజలు కూడా దొరకవు.

– మన్నె సుబ్బారావు, ఎర్ర చెరువు ఆయకట్టు రైతు, కోడూరు

పాలకుల అసమర్థత వల్లే..



పాలకుల అసమర్థత వల్లే సాగర్ జలాలు రాక ఎర్ర చెరువు నిండలేదు. వర్షానికి వచ్చిన కొద్దిపాటి నీరు కూడా భారీ గుంతలలో ఉండిపోయింది. చెరువు కింద సాగు కష్టంగా మారింది. ప్రభుత్వం వెంటనే స్పందించి సాగర్ జలాలను తీసుకురాకపోతే రైతులకు తినడానికి తిండి కూడా దొరకదు.

– జంగం రామారావు, రైతు, కోడూరు

నేడు 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ'

తిరువూరు: తిరువూరు పట్టణంలోని 5, 9 వార్డుల్లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం సోమవారం నిర్వహిస్తామని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ తెలిపారు. ఉదయం 5వ వార్డులో, సాయంత్రం 9వ వార్డులో జరిగే కార్యక్రమానికి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు హాజరవుతారని, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు

నూజివీడు: గత తొమ్మిది రోజులుగా త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక నూజివీడు కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కృష్ణాష్టమి వేడుకలు ఆదివారంతో ముగిశాయి. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన ప్రత్యేక పందిళ్ల కింద తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీనిలో భాగంగా నిత్యపూజలు, భగవద్గీత పారాయణం జరిగాయి. శ్రీకృష్ణుడి ప్రతిమను పట్టణంలోని ప్రధాన రహదారులలో ఊరేగించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక నూజివీడు కమిటీ అధ్యక్షుడు అరుణ్ కుమార్, ఆంజనేయులు నాయక్, మద్దిరాల రవి, వంశీ, అశోక్, రామాంజనేయులు, శ్రీకాంత్, కోటేశ్వరరావు, శ్యామ్ పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

మైలవరం: రౌడీ షీటర్‌లు, నేర చరిత్ర కలిగిన వారిపై నిఘా ఉంటుందని, వారు హద్దు మీరితే కఠిన చర్యలు తప్పవని రెడ్డిగూడెం ఎస్ఐ మోహనరావు హెచ్చరించారు. రెడ్డిగూడెం పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లు, నేర ఆరోపణలు ఉన్న వారికి ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. వినాయక చవితి సందర్భంగా ఎలాంటి గొడవలకు పాల్పడకూడదని సూచించారు. రాజకీయ పార్టీల ర్యాలీల్లో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటామని, హద్దు మీరి ప్రవర్తిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

రైతులను మోసం చేసిన కూటమి ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి స్వామిదాసు



క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న స్వామిదాసు, నాయకులు

తిరువూరు: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన యూరియా సరఫరా చేయలేక కూటమి ప్రభుత్వం కల్లబొల్లి మాటలు చెబుతోందని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు విమర్శించారు. తిరువూరు మూడో వార్డు సీఎస్ఐ చర్చి సెంటర్‌లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం ఆదివారం జరిగింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా గ్రామాల్లోనే రైతులకు అన్ని ఎరువులు అందుబాటులో ఉంచారని, ఐదేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులకు ఎరువుల కొరత లేదని స్వామిదాసు తెలిపారు. ఇప్పుడు ఉద్దేశ్యపూర్వకంగా యూరియాకు కృత్రి మ కొరత సృష్టించి నానో ఎరువుల అమ్మకం పేరుతో రైతులను మోసం చేస్తున్నారని, ఖరీఫ్ పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారని స్వామిదాసు ఆవేదన వ్యక్తం చేశారు. 143 పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు ఇంతవరకు వాటి ఊసే ఎత్తకపోవడం సిగ్గుచేటన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కంటే ఎక్కువ సంక్షేమ పథకాలు అందిస్తానని అబద్ధపు హామీలిచ్చి గద్దెనెక్కిన చంద్రబాబు నైజం ఏడాది పాలనలోనే ప్రజలకు అవగతమైందని, పేదలను పట్టించుకోని ముఖ్యమంత్రి పెత్తందారులకు ఊడిగం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. తిరువూరు నియోజకవర్గంలో ప్రభుత్వ పాలన అటకెక్కిందని, ప్రజల కనీస అవసరాలు నెరవేర్చే పరిస్థితి లేదని విమర్శించారు. తిరువూరు ఎమ్మెల్యే శ్రీనివాసరావు ఇచ్చిన హామీలు ఏమయ్యాయో ఆయనకే తెలియాలన్నారు. అభివృద్ధి మాట దేవుడెరుగు, పడిపోయిన వంతెనలు, గోతులు పడిన రోడ్ల గురించి పట్టించుకోవాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ, లీగల్ సెల్ కన్వీనర్ రేగళ్ల మోహన్‌రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి కాలసాని గోపాల నాగేశ్వరరావు, పార్టీ కార్మిక విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు యరదేశి రామారావు, నగర పంచాయతీ కౌన్సిలర్లు మోదుగు ప్రసాద్, పరసా శ్రీనివాసరావు, ఏరువ ప్రకాష్‌రెడ్డి, గుంటూరు మస్తాన్, నాయకులు షేక్ జాకీర్, మోషే, తిరుమలశెట్టి వేణుబాబు, ఇనపనూరి రవి తదితరులు పాల్గొన్నారు. చంద్రబాబు హామీలిచ్చి మరచిన పథకాలపై క్యూ ఆర్ కోడ్ ద్వారా అవగాహన కల్పించారు.

చవితి సందడి



నూజివీడులో గణేష్ ఉత్సవాలకు సిద్ధంగా ఉన్న గణనాథులు



శివపార్వతులతో ఉన్న గణపతి విగ్రహాలు

నూజివీడు: మరో రెండు రోజుల్లో ప్రారంభం కానున్న వినాయక చవితి పండుగను పురస్కరించుకొని గ్రామాల్లో వినాయక ప్రతిమల ఏర్పాటులో నిర్వాహకులు బిజీగా ఉన్నారు. మట్టి గణపయ్యల విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు మొగ్గుచూపుతున్నారు. నూజివీడు పట్టణంలో దాదాపు 40 నుంచి 50 చోట్ల గణపతి విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో విగ్రహం రూ.5 వేల నుంచి రూ.40 వేల వరకు ధర పలుకుతోంది. నియోజకవర్గంలోని గ్రామాల్లోనూ చవితి సందడి నెలకొంది. నూజివీడులోని విజయవాడ రోడ్డులో రాజస్థాన్‌కు చెందిన జెస్సా రామ్ వివిధ ఆకృతులలో విగ్రహాలను తయారు చేసి విక్రయిస్తున్నారు. ఈ ఏడాది 160 విగ్రహాల వరకు తయారు చేయగా ఇప్పటి వరకు 100 విగ్రహాలు బుక్ అయ్యాయని తయారీదారుడు పేర్కొన్నాడు. నాలుగు అడుగుల ఎత్తు నుంచి 10 అడుగుల ఎత్తు విగ్రహాలను తయారు చేస్తున్నారు. పోలీసు, అగ్నిమాపక, విద్యుత్ శాఖల అనుమతి తీసుకుని విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని చాట్రాయి ఎస్ఐ రామకృష్ణ, ఆగిరిపల్లి ఎస్ఐ శుభ శేఖర్, ముసునూరు ఎస్ఐ ఎం. చిరంజీవి పేర్కొన్నారు. మండపాల వద్ద నిబంధనలు పాటించాలని వారు నిర్వాహకులకు సూచించారు.

వీధుల్లో ఎక్కడి చెత్త అక్కడే!



ఆగిరిపల్లి మెయిన్ రోడ్డులో పేరుకుపోయిన చెత్త

ఆగిరిపల్లి: మండల కేంద్రమైన ఆగిరిపల్లి వీధుల్లో చెత్త పేరుకు పోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. మూడు రోజుల నుంచి పారిశుద్ధ్య కార్మికులు విధులకు హాజరు కాకపోవడంతో రోడ్లన్నీ చెత్తతో దర్శనమిస్తున్నాయి. గ్రామంలో 15 మంది పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. గత నెలలో కార్మికులకు ఇవ్వాల్సిన జీతం ఇప్పటివరకు అధికారులు ఇవ్వలేదు. సాక్షాత్తు మంత్రి కొలుసు పార్థసారథి ఐదు నెలల క్రితం పారిశుద్ధ్య కార్మికులకు రూ.2 వేలు పెంచామని ఆర్భాటంగా చెప్పారు. ఇంతవరకు పెంచిన జీతాలను అధికారులు ఇవ్వడం లేదు. అధికారులకు పంచాయతీ కార్మికులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకున్న పాపాన లేదు. చేసేది లేక మూడు రోజుల నుంచి పారిశుద్ధ్య కార్మికులు విధులకు హాజరు కావడం లేదు. గ్రామంలో వైరల్ ఫీవర్‌తో ఇబ్బందులు పడుతుంటే ఈ చెత్త బాధలు ఏమిటని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ ఇన్‌చార్జ్ కార్యదర్శి లక్ష్మిని వివరణ కోరగా త్వరలోనే పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు.

ఇబ్రహీంపట్నం ఫెర్రి వద్ద పంటపొలాల్లో నిలిచిన వర్షం నీరు



వర్షంనీటిని తోడిస్తున్న రైతు



చెరువు కాదు.. పంటపొలం

ఇటీవల కురిసిన వర్షాలకు ఇబ్రహీంపట్నం మండలం ఫెర్రి వద్ద పంట పొలాల్లోకి వర్షం నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. వర్షాలు తగ్గాయి. పొల్లాల్లో చేరిన వర్షం నీరు సుమారు రెండు వారాలు కావస్తున్నా బయటకు వెళ్లకపోవడంతో ఖర్చయినా సరే రైతులు ఆయిల్ ఇంజిన్లు పెట్టి నీటిని బయటకు తోడిస్తున్నారు. రైతు నీటిని బయటకు తోడిస్తున్న దృశ్యాన్ని 'సాక్షి' కెమెరాలో బంధించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

సుంకాల రద్దు రైతు వ్యతిరేక చర్యే

అఖిల భారత కిసాన్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి హరినాథ్

నూజివీడు: విదేశీ పత్తి దిగుమతులపై 11 శాతం సుంకాన్ని రద్దు చేయడం రైతు వ్యతిరేక చర్యే అని అఖిల భారత కిసాన్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి డి.హరినాథ్ ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. సోమవారం చర్చలు జరుగుతున్న నేపథ్యంలో ముందుగానే సుంకాలు తగ్గించడం ఎవరిని ప్రసన్నం చేసుకునేందుకని ప్రశ్నించారు. ప్రజా ప్రయోజనాల కోసం సుంకాలు రద్దు చేశామని చెప్పడం పచ్చి బూటకమని విమర్శించారు. ఈ నిర్ణయంతో మన దేశంలో పత్తి పండించే రైతులపై తీవ్ర ప్రభావం పడుతుందని, నష్టాల ఊబిలో చిక్కుకునే ప్రమాదం ఉందని హరినాథ్ హెచ్చరించారు. మన దేశం నుంచి పత్తిని ఎగుమతి చేయడానికి అవకాశం ఉండగా మన రైతులకు నష్టం కలిగే విధంగా విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన అవసరం ఏమిటని హరినాథ్ ప్రశ్నించారు.

రాకపోకలకు నరకయాతన

- అధ్వానంగా రహదారులు
- ప్రయాణికులు, పాదచారుల ఇబ్బందులు



కవులూరు శివారులోని బుడమేరు డైవర్షన్ కెనాల్‌కు సమీపంలో అధ్వానంగా మారిన రహదారి

జి.కొండూరు: మండల పరిధి కవులూరు నుంచి శాంతినగర్ మీదుగా కొండపల్లి వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. ఈ రహదారి కవులూరు జెడ్పీ హైస్కూల్ నుంచి శాంతినగర్ వద్ద బుడమేరు డైవర్షన్ కెనాల్‌పై ఉన్న వంతెన వరకు 1.4 కిలోమీటర్లు ఉండగా గత ప్రభుత్వ హయాంలో మంజూరైన రూ.60 లక్షల నిధులతో 800 మీటర్లు మేర సీసీ రోడ్డు నిర్మించారు. మిగిలిన 600 మీటర్ల రహదారి గత ఏడాది ఆగస్టులో వచ్చిన వరదలకు బుడమేరు డైవర్షన్ కెనాల్‌కు భారీ గండ్లు పడిన ప్రదేశానికి సమీపంలో ఉండడంతో కోతకు గురై భారీ గుంతలు ఏర్పడ్డాయి. అయితే ఈ ఏడాది కాలంగా కూటమి ప్రభుత్వం ఈ ఆరు వందల మీటర్ల రహదారి అభివృద్ధికి నిధులు కేటాయించకపోవడంతో రహదారి అధ్వానంగా మారి కవులూరు గ్రామస్తులు రాకపోకలకు నరకయాతన పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రహదారిని అభివృద్ధి చేయాలని కవులూరు గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డుపై వ్యర్థాలతో గ్రామస్తుల ఆగ్రహం

తొలగించాలని ఆందోళన



సీఐ, ఎంపీడీఓలతో మాట్లాడుతున్న ఉప సర్పంచి అచ్చి కాసులు

నూజివీడు: మండల పరిధి తుక్కులూరులోని క్వారీ రోడ్డుపై శ్మశానంలో సమాధులను పగులగొట్టిన రాళ్లను, నాపరాళ్ల ముక్కలను పోయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ చర్యకు వ్యతిరేకంగా ఆదివారం గ్రామంలో పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. శ్మశానంలో తవ్వినవి ఇక్కడ పోయడమేమిటని అధికార పార్టీ నాయకులపై మండిపడ్డారు. విషయం తెలుసుకున్న సీఐ కొప్పిశెట్టి రామకృష్ణ, రూరల్ ఎస్ఐ జ్యోతిబసు ఘటనాస్థలానికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడేందుకు ప్రయత్నించారు. ఆర్ఐ అశోక్, వీఆర్వో ఉషారాణి, పంచాయతీ కార్యదర్శి నాగచంద్రిక ఘటనా స్థలానికి చేరుకున్నారు. రోడ్డుపై పోసిన రాళ్లు, నాపరాళ్ల ముక్కలను అక్కడ నుంచి తొలగిస్తేనే ఆందోళనను విరమిస్తామని, లేకపోతే కొనసాగిస్తామని గ్రామస్తులు స్పష్టం చేశారు. ఈ విషయం ఎంపీడీఓ దృష్టికి వెళ్లడంతో ఆయన హుటాహుటిన తుక్కులూరు చేరుకున్నారు. పంచాయతీ ఉప సర్పంచి అచ్చి కాసులు శ్మశానంలో పగులగొట్టిన రాళ్లను, నాపరాళ్లను రోడ్డుపై పోయడమేంటని ప్రశ్నించారు. ఆందోళన చేస్తున్న గ్రామస్తులతో చర్చించిన ఎంపీడీఓ వెంటనే రాళ్లు, నాపరాళ్ల ముక్కలను జేసీబీని ఏర్పాటు చేసి తొలగించేలా చర్యలు తీసుకున్నారు.

పాడుబడిన బావిని పూడ్చరూ..



జి.కొండూరు: మండల పరిధి చెర్వుమాధవరం గ్రామంలో ప్రధాన రహదారిని ఆనుకుని అంతర్గత రహదారికి మధ్యలో ఉన్న పాడుబడిన బావి ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. ఈ బావి వినియోగంలో లేనప్పటికీ పూడ్చకుండా వదిలివేయడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. అంతర్గత రహదారిని సీసీ రోడ్డుగా అభివృద్ధి చేసినప్పటికీ రహదారికి అడ్డంగా బావి ఉండడంతో ఈ రహదారిలోకి భారీ వాహనాలు వెళ్లాల్సి వచ్చినప్పుడు సమస్య తలెత్తుతోంది. అంతే కాకుండా ప్రధాన రహదారిని ఆనుకుని ఉండడంతో భారీ వాహనాలు అదుపు తప్పి బావి వైపు వస్తే పెను ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు వెంటనే స్పందించి ఈ బావిని పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

వైభవంగా ఎల్లమ్మ తల్లి కల్యాణం



చాట్రాయి: మండలంలోని చనుబండ గ్రామంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కల్యాణాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చుట్టు పక్కల గ్రామాల నుంచి వేలాదిమందిగా భక్తులు తరలి వచ్చారు. అనంతరం 1,500 మందికి అన్నదానం చేశారు.

నేడు స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ

తిరువూరు: ఎ.కొండూరు మండలం పాతరేపూడిలో సోమవారం స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తామని తహసీల్దారు కె. లక్ష్మి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాదేశాల మేరకు కార్డుదారులకు వీటిని ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పంపిణీ చేస్తామని చెప్పారు.